క్లుప్తంగా

గురుకులంలో బోనాల ఉత్సవాలు



బోనాల ఉత్సవాల్లో పూలే గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్: మహాత్మ జ్యోతిరావ్‌పూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బోనాల ఉత్సవాలు జరిపించారు. విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాల గురించి అవగాహన కల్పించడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వీణచందనం చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సందడి చేశారు.

పీఆర్సీని ప్రకటించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): పీఆర్సీని కటించి, స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఆ నాయకులు లీప్ నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఆర్సీని ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదగిరి, రాంరెడ్డి, కిష్టయ్య, ప్రశాంత్, కనకయ్య, రాజు, ఉమారాణి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, శ్రీనివాస్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన మిత్రులు



లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మిత్రులు

వర్గల్(గజ్వేల్): తమతో కలిసి చదువుకుని ఇటీవల మరణించిన ఇద్దరు స్నేహితుల కుటుంబాలకు మిత్రులు అండగా నిలిచారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 93–94లో తమతో కలిసి పదో తరగతి చదివిన ఆరె లక్ష్మణ్(మామిడ్యాల), ఆకుల రవి(ములుగు) ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా మిత్రులు అందరూ తలోచేయి వేసి రూ.లక్ష పోగుచేశారు. బుధవారం వారు ఆయా కుటుంబాలు రూ.50 వేలు చొప్పున అందజేశారు.

ప్రొటోకాల్ గురించి మాట్లాడే హక్కు లేదు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రొటోకాల్ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ గురించి అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంజుల ఉండగా, మంజుల భర్త మాజీ చైర్మన్ రాజనర్సు ఏ విధంగా కూర్చొంటారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేకపోతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడ ఓటమి చెందుతామో అని ఆందోళన, భయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉందన్నారు. కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాజొద్దీన్, హర్షద్, సలీం ఫయాజ్, మున్నా, ఫయాజ్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన బూరగోని హరి కుమారుడు వెంకట్ వైద్యం కోసం మంజూరైన రూ.1.50లక్షల ఎల్‌ఓసీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్ మూత్ర నాళాల సంబంధిత సమస్యతో బాధపడుతున్న విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి ఎల్‌ఓసీ మంజూరు చేయించారన్నారు. మంత్రి పొన్నం నాగపురి కిరణ్‌కు బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రమాదకరంగా పశు వైద్యశాలలు

- ముప్పైయేళ్ల కిందటి భవనాలు
- బీటలు వారిన స్లాబులు
- చినుకు పడితే కారుతున్న నీరు
- ప్రతిపాదనలు పంపినా పట్టింపులేదు

ముప్పై దశాబ్దాల కిందట నిర్మించిన పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కురిసినా స్లాబులు, గోడలు బీటలు వారాయి. చిన్నపాటి వర్షం కురిసినా నీళ్లు కారి రైతులతోపాటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకరంగా మారిన భవనాల స్థానంలో నూతనంగా నిర్మించాలని ప్రతిపాదనలు పంపినా పట్టించుకునే వారే కరువయ్యారు.



శిథిలావస్థకు చేరిన నంగునూరు పశువైద్యశాల



స్లాబు, గోడలకు పగుళ్లు ఏర్పడి కారుతున్న నీరు

నంగునూరు(సిద్దిపేట): మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను నంగునూరు, పాలమాకుల, గట్లమల్యాల, బద్దిపడగ, నర్మెట గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉన్నాయి. ఆయా సెంటర్లలో ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, ఒకరు జేఈఓ, మరో సహాయకుడు సేవలు అందిస్తున్నారు. ఎనిమిది నెలల కిందట నంగునూరు వైద్యాధికారి మృతి చెందడంతో పాలమాకుల సెంటర్ వైద్యాధికారే అన్ని సెంటర్లను పర్యవేక్షిస్తున్నారు.

ఉరుస్తున్న గదులు

నంగునూరు, పాలమాకుల, బద్దిపడగ గ్రామాల్లో 1993లో పశు వైద్యశాలలకు పక్కా భవనాలు నిర్మించారు. అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. స్లాబులు, గోడలు బీటలు వారాయి. దీంతో చినుకు పడితేచాలు మూడు సెంటర్లలో స్లాబు నుంచి నీరు లీకై గదులు ఉరుస్తున్నాయి. దీంతో తమకు తిప్పలు తప్పడంలేదని సిబ్బందితోపాటు వైద్యశాలకు వచ్చే పాడిరైతులు, పశు పాలకులకు వాపోతున్నారు. ఉన్నతాధికారుల స్పందించి కొత్త భవనాలను నిర్మించాలని, అలాగే నంగునూరుకు వైద్యాధికారిని నియమించాలని వారు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

మండలంలోని మూడు వైద్యశాలల పరిస్థితిపై సంవత్సరం కిందటే నివేదిక అందజేశాం. కొత్త భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామని ఉన్నతాధికారులు తెలియజేశారు. త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

– ప్రశాంత్‌రెడ్డి, పశు వైద్యాధికారి, పాలమాకుల

యూరియా దాచి పెడితే కఠిన చర్యలు

యూరియాను అక్రమంగా దాచి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు, వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఎరువులు దుకాణాలు, ఫ్యాక్టరీలు, అనుమానిత ప్రదేశాల్లో బుధవారం వారు సోదాలు నిర్వహించారు.

- గోదాములు, ఎరువుల దుకాణాల్లో ముమ్మర తనిఖీలు
- రైతులను ఇబ్బందులు పెట్టొద్దు
- పోలీసులు, వ్యవసాయ అధికారులు



సిద్దిపేటఅర్బన్: తనిఖీ చేస్తున్న సీఐలు విద్యాసాగర్, రమేశ్, వ్యవసాయ అధికారులు



మిరుదొడ్డి(దుబ్బాక): ఫంక్షనింగ్ ఇండస్ట్రీస్‌లో సోదా చేస్తున్న ఏడీఏ మల్లేశం, ఎస్ఐ సమత

సిద్దిపేటఅర్బన్/మిరుదొడ్డి(దుబ్బాక)/ములుగు(గజ్వేల్)/కోహెడ(హుస్నాబాద్)/దౌల్తాబాద్(దుబ్బాక)/చిన్నకోడూరు(సిద్దిపేట)/మర్కూక్(గజ్వేల్)/సిద్దిపేటరూరల్: సిద్దిపేటఅర్బన్ మండలం పరిధిలోని అశోక్ లేలాండ్ సర్వీసింగ్ సెంటర్, పటేల్ డైరీ ఫార్మ్, ఎరువుల దుకాణాలు, రైస్‌మిల్, పైప్స్ ఫ్యాక్టరీలలో మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనాథ్, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావుతో కలిసి త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, టాస్క్ ఫోర్స్ సీఐ రమేశ్ తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ నమ్మదగిన సమాచారం మేరకే అనుమానిత ప్రదేశాలలో సోదాలు చేశామన్నారు. యూరియాను దాచిపెట్టి బ్లాక్ మార్కెట్ చేసినా, అక్రమంగా ఫారాలలో దాచి పెట్టినా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కిష్టసాగర్ దారిలో ఉన్న పాల డైరీలో యూరియా దాచి పెట్టారనే సమాచారంతో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. మిరుదొడ్డిలో మండల వ్యవసాయ అధికారి మల్లేశం ఆయా దుకాణాలకు సంబంధించిన రికార్డులు, రసీదులు, ఎరువుల విక్రయాలను పరిశీలించారు. యూరియా కృతిమ కొరత సృష్టించినా.. అక్రమంగా మరో ప్రాంతానికి తరలించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ సమత, పోలీస్ సిబ్బంది, ఏఈఓలు పాల్గొన్నారు. ములుగు మండల పరిధిలోని పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్లు, ఎరువుల దుకాణాలలో ఎస్ఐ విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి ప్రగతి తనిఖీలను చేపట్టారు. కోహెడలో విజయలక్ష్మి ఎరువులు, విత్తనాల దుకాణంలో ఏడీఏ మల్లయ్య, ఎస్ఐ అభిలాష్ తనిఖీలు నిర్వహించారు. యూరియా నిల్వలపై ఆరా తీశారు. రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని ఏఓ సతీశ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో గోరిట్యాల వేణు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలో ఎస్ఐ అరుణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ ఎరువుల దుకాణాలు, గోదాములను పరిశీలించారు. చిన్నకోడూరు మండల పరిధిలో ఎస్ఐ సైఫ్ అలీ, మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్‌కుమార్, ఏఈఓలు పరిశ్రమలు, గోదాములు, ఫౌల్ట్రీ ఫామ్‌లలో సోదాలు చేశారు. సిద్దిపేటరూరల్ వ్యవసాయ మండలాధికారి నరేశ్, ఎస్ఐ రాజేశ్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామ శివార్లో ఉన్న కోళ్లదానా ఫ్యాక్టరీలను తనిఖీ చేశారు.

నానో యూరియానే మేలు

మర్కూక్ (గజ్వేల్): నానో యూరియా వాడకంతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ అప్రోజ్ సూచించారు. మండలంలోని నర్సన్నపేటలో ఇఫ్కో ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన రైతులకు అవగాహన కల్గించారు. రైతులకు ఖర్చులను తగ్గించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం నానో యూరియాను తీసుకువచ్చిందన్నారు. 500 ఎంఎల్ రూ.255కే దొరుకుతుందని, అది ఒక ఎకరాకు సరిపోతుందని చెప్పారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తవద్దు

ఏసీపీ సదానందం



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం సూచించారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. మల్లన్న ఆలయానికి ఎవరు వస్తున్నారు? ఎవరు పోతున్నారు? ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే వారి కదలికపై నిఘాపెట్టాలని సూచించారు. ఆలయ పరిసరాలలో ప్రైవేట్ వసతి గదులను అద్దెకిచ్చేవారికి నేరాలపై అవగాహన కల్పించాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐలు రాజు, నవీన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులు అప్రమత్తం

- అందుబాటులో ఉండండి
- సత్వర స్పందనకై కంట్రోల్ రూమ్
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



వార్డులో పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, పట్టణంలో ఏవిధమైన సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. పట్టణంలో కురిసిన వర్షం నేపథ్యంలో బుధవారం ఆయన పలు వార్డుల్లో సందర్శించారు. అనంతరం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరుసగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసిన క్రమంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్, చెత్త, చెదారాలను తొలగించాలని, వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని చెప్పారు. పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని, దోమల వ్యాప్తికి కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా పనులను వేగవంతం చేయాలని, మూడు రోజుల పాటు వర్షాల కారణంగా కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు 9505507248 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. పట్టణంలో పురాతన ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని సిబ్బందికి సూచించారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రామ్‌ప్రసాద్ తదితరులు

విద్యార్థులకు రోటరీక్లబ్ చేయూత

100 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ములుగు(గజ్వేల్): రోటరీ క్లబ్ ద్వారా విద్యార్థులకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ డాక్టర్. ఎస్‌వీ రామ్‌ప్రసాద్ అన్నారు. ములుగులోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్లబ్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం సుమారు వంద మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. ముఖ్యతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. కాలినడకన స్కూళ్లకు వెళ్తున్న పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నామన్నారు. అసిస్టెంట్ గవర్నర్ జగదీశ్వర్, హెల్ప్ టు నీడీ ఉపాధ్యక్షుడు బాబుగౌడ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, సాయిరెడ్డి, బాలకృష్ణ, పురుషోత్తం, నర్సింహారెడ్డి, బాపురెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించకపోతే తొలగిస్తాం

- నాణ్యమైన భోజనం అందించాలి
- ఎంఈఓ గుగులోతు రంగానాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రంగానాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు ఉపాధ్యాయులు అన్నం, కూరలను విధిగా పరిశీలించాలని, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా విధుల నుంచి తొలగిస్తామని ఎంఈఓ గుగులోతు రంగానాయక్ హెచ్చరించారు. 'ఉడకని అన్నం నీళ్లచారు'.. పప్పంతా కారమే, కానరాని కూరగాయాలు, ఆకు కూరలు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంఈఓ స్పందించారు. దీంతో ఆయన బుధవారం ఉదయమే మండలంలోని జనగామ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. అక్కడే మధ్యాహ్నం వరకు ఉండి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజు మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుంది.. మెనూ పాటించడం లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ పాటించకుండా నీళ్లచారు, అన్నం వడ్డిస్తున్నారని విచారణలో తేలిందన్నారు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కార్మికులతో ఓ లెటర్ రాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్



శ్రీహన్వి తండ్రికి నగదు అందజేస్తున్న రమేశ్‌గౌడ్

చిన్నారికి అండగా ఉంటా..

ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): వేడినీళ్ల బకెట్‌లో పడి తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీహన్వి గురించి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరా తీశారు. ఆ చిన్నారి దీనావస్థపై సాక్షిలో మంగళవారం ప్రచురితమైన 'అయ్యో చిన్నారి' కథనానికి ఆయన స్పందించారు. నంగునూరుకు చెందిన శ్రీహన్వి వేడినీళ్ల బకెట్‌లో పడి చికిత్స పొందుతున్న ఆస్పత్రికి విషయంపై హరీశ్‌రావు ఫోన్‌చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నంగునూరు పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉల్లి మల్లయ్య ద్వారా తక్షణ సహాయం కింద రూ.25 వేలు అందజేశారు. చిన్నారి తండ్రి నగేశ్‌తో ఫోన్‌లో మాట్లాడి పాపకు అన్ని విధాల అండగా ఉంటామని, కోలుకునే వరకు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ సమస్య పరిష్కరిస్తాం

- జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్
- తిగుల్ పీహెచ్‌సీ పరిశీలన



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతామని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. తిగుల్ ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ సమస్యపై 22న సాక్షిలో ప్రచురించిన 'అంధకారంలో ఆస్పత్రి' అనే కథనానికి ఆయన స్పందించారు. బుధవారం ఆయన పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. పాతభవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిందని, కొత్త భవనంలో బాగానే ఉందన్నారు. విద్యుత్ సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఆశావర్కర్లు ఇంటింటికి తిరిగి ప్రజలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని చూసించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్, వైద్యుడు రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, సిబ్బంది నారాయణ, శ్వేత, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



మంగోల్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న స్థానికులకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు బుధవారం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో ప్రచురించిన 'తాగునీటికి తప్పనితిప్పలు' అనే కథనానికి ఎంపీడీఓ రాంప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ స్పందించారు. కోమటిబండ నుంచి మండలానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీటి సరఫరాలో తలెత్తిన లోపంతో నీరు సరఫరా కావడం లేదన్నారు. తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తూ ప్రజల ఇబ్బందులు తీరుస్తామని హామీ ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉద్యమకారుల హామీలను పట్టించుకోరా?

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ యాదగిరి డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్‌లో బుధవారం ఉద్యమకారుల జేఏసీ జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవు తున్నా ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులను అందించాలన్నారు. 250 గజా లు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మాణం, ప్రతి నెలా రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జహంగీర్, యాదగిరి, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, అరుణ, కమల, చంద్రకళ, సత్యనారాయణ, బాలయ్య, భాగ్య, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాలల నిధులపై ఆడిట్

దౌల్తాబాద్(దుబ్బాక): మండల వనరుల కేంద్రంలో పాఠశాలల నిధుల వినియోగంపై బుధవారం ఆడిట్ నిర్వహించినట్టు మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు చెప్పారు. ఆడిట్ అధికారులు కోటేశ్వర రావు, రమేశ్ ఆధ్వర్యంలో 2024–2025 సంవత్సరానికి ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని శేరిపల్లిలోని మహాత్మజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో రాయపోల్ ఎంఈఓ సత్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్ఎంలు గోపాల్‌రెడ్డి, అఫ్జల హుస్సేన్, బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

నంగునూరు(సిద్దిపేట): జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నంగునూరులో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు వెంకట్రామిరెడ్డి, కనకయ్య, తిరుపతిరావు, రజినీకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐలో రెండో విడతలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. 31 వరకు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఏటీసీలతో పాటు ఆరు అధునాతన కోర్సుల్లో 200 వరకు ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

◆ మహిళలకు వరం 'మహాలక్ష్మి'

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళలు, విద్యార్థినులకు మహాలక్ష్మి పథకం వరం లాంటిదని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భవాని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 200 కోట్ల మంది ప్రయోజనం పొందిన సందర్భంగా ఆర్టీసీ డిపోలో బుధవారం మహిళా సాధికారితపై నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. డీఎం పవన్, అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తులకు గడువు పెంపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల గడువును ఆగస్టు 31 వరకు పెంచినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి కవిత బుధవారం తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి గాను ఉన్నత విద్య కోసం విదేశాల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ఈ పథకానికి అర్హులని, అర్హత కల్గిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ కార్యాలయంలో (9989803582) సంప్రదించాలని సూచించారు.

◆ స్వచ్ఛ సర్వేక్షణ బృందం సందర్శన

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రావురూకులలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ సర్వే బృందం బుధవారం సందర్శించింది. గ్రామంలో ఇంటింటికి తిరిగి మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ, స్వచ్ఛతలో సాధించిన ప్రగతిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలలో చెత్త నిర్వహణపై ఆరా తీశారు. ప్రతీ ఒక్కరూ స్వచ్ఛ సర్వేక్షణలో భాగం కావాలని పిలుపునిచ్చారు. దీప్తి, శ్రీలత, సత్యనారాయణ, చెన్నారెడ్డి, ఎంపీడీఓ మురళీధర శర్మ, ఎంపీఓ విష్ణు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ తహసీల్దార్‌కు వినతిపత్రం

కొండపాక(గజ్వేల్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ సంఘం జిల్లా నాయకులు యాదగిరి, విజయేందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని, పీఆర్సీని విడుదల చేయాలని, 5,571 ప్రాథమిక పాఠశాలలకు హెచ్ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కనకయ్య, సావిత్రి, నవిత తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజ్ఞాపూర్‌లో సమస్యలను పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కొండపోచమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజులు మాట్లాడుతూ తాగునీటి సమస్య, కుక్కలు, కోతుల బెడదను పరిష్కరించాలన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, శివులు, ప్రశాంత్, నాగరాజు, నరేశ్ పాల్గొన్నారు.

◆ టాస్క్‌ఫోర్స్ దాడులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పాల కేంద్రాలు, పెట్రోల్ బంకులను మండల వ్యవసాయ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ టీం దాడులు నిర్వహించింది. పట్టణంలోని పెట్రోలు బంకుల్లో ఆయిల్ నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అలాగే అలిరాజ్‌పేటలో పాల కేంద్రాన్ని, పాతర గడ్డి తయారు చేస్తున్న కంపెనీని తనిఖీ చేశారు. ఏఎస్ఐ రమణరెడ్డి, లింగం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయ స్థలాలకు అక్రమ పట్టాలు ఈ

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల స్థలాలను అక్రమంగా పట్టా చేయించారని ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు బుధవారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావుకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన యాదగిరి ఆలయాల భూములకు అక్రమంగా పట్టాలు చేయించి వాటిని విక్రయిస్తున్నాడని ఆరోపించారు. అక్రమ పట్టాను రద్దుచేయాలని కోరారు. గ్రామస్తులు రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.